# నీటి బుడగలు

బి. పి. కరుణాకర్

[పదకొండు గంటలకల్లా సిద్ధిక్ దగ్గరకు వస్తానన్న రేణు— ఆ తర్వాత సిద్ధిక్ నిద్రపోతుండగా వచ్చింది! ఐతే సరిగ్గా పదకొండు గంటలకు రేణు లారీ ప్రమాదంలో చచ్చిపోయింది అంటాడు నరుసు. కావాలని ఆర్ముగం పెన్ను తీసుకుని, తిరిగివచ్చి ఆ పెన్ను పోయిందని మరో పెన్ను ఆర్ముగానికి యిచ్చాడు— ఈ గందరగోళానికి వెనుకవున్న కథ ఏమిటో!]

వర్షం కుండపోతగా కురిసి ఆగిపోయింది చల్లటి గాలివీస్తోంది. కౌంటర్ దగ్గర కూర్చున్న ఆర్ముగం నిద్రకు ఆగలేక అప్పటికే నాలుగు సార్లు టీ త్రాగాడు. టైం చూసుకున్నాడు. పదిన్నర దాటింది. సిగరెట్ త్రాగుదా మని పించింది. డ్యూటీలో వున్నప్పుడు తాగ కూడదు. తన నెవరేనా రిలీవ్ చేయాలి. నరసు లేడు. ఎక్కడో నిద్రపోతూ వుంటాడు. కాస్త ఖాళీ దొరికితేచాలు. నిద్రాదేవి ప్రక్క లో వాలిపోతుంటాడు. లేచి నుంచుని బద్ధకం వదిలిపోయేటట్లు ఒళ్ళు విరుచుకున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది.

అందుకున్నాడు.

“నరసు ఉన్నాడా?” అవతలనుంచి ఎవరో అడిగారు.

“రెండు నిమిషాలు ఆగండి. కనుక్కొని చెప్తాను.” అన్నాడు ఆర్ముగం.

జడంతా కొప్పుగా చుట్టుకుని తన నొకసారి పరీక్షించుకుంది రేణు. తన అందము తనకే చాలాసార్లు మత్తుగా వుంటుంది అనుకుంది.

తలుపు చప్పుడైంది.

విసుక్కుని లేచింది.

“ఎవరు ?”

“నేను ”—నరసు కంఠం.

తలుపుతీసింది రేణు.

“ఏం అంతతొందర? కొంప మునిగిపోతు న్నట్లు తలుపు కొడుతున్నావ్ !” అంది నవ్వుతూ.

“మీకు ఫోన్ వచ్చింది.”అన్నాడు నరుసు.

“ఎక్కడ్నుంచి”

“సిద్ధిక్ దగ్గర్నుండి - నేనేమో నిద్రపోతు న్నాను ఆర్ముగం వచ్చి లేపాడు. కనెక్షన్ యిస్మంటారా?’

తలూపింది రేణు

“సిద్ధిక్ జీ! నమస్తే చాలాకాలానికి గుర్తుకు వచ్చాము. ఎలావున్నారు?” అంది ఫోను అందుకుని.

“మీ దయవల...”

“చాల్చాలు. ఏమిటీ యింత త్వరగా గుర్తు కొచ్చాము?”

ఫోనులో నవ్వు వినిపించింది.

“రేణూ! నువ్వు ఎప్పటికీ గుర్తుంటావు.”

‘ముఖస్తుతి.’

‘కాదు’

‘మీ అవసరం తీరేవరకూ.’

‘కానేకాదు ’

‘మీ మిసెస్ కాశ్మీర్ నుండి వచ్చిందా?’

‘రాలేదు.’

‘ఓహో అందుకా ఫోన్ చేసింది మహాత్మా’

‘కాదు ఎప్పట్నుంచో నీకు కబురు చేద్దా మని అనుకుంటున్నాను. ఈ రోజు వీలు పడింది. నువ్ ఈ రాత్రికి తప్పక రావాలి’

‘ఎందుకేమిటి?’

‘సినిమాకు వెళ్దాం’

రేణు సమ్మోహనంగా నవ్వింది. ‘మనిద్దరి కోసం రాత్రి పదకొండు గంటలకు ఏ సినిమా హాలు బుకింగ్ క్లర్కు మేలుకొని వుండడు.’ అంది.

“ఏదైతేనం కాలం గడచి పోడానికి. బీచ్‌లో వెన్నెల్లో కూర్చుని సముద్రాన్ని చూద్దాం. ప్రపంచానికి కొద్దిసేపు దూరంగా వెళ్ళిపోదాం రావూ ప్లీజ్!’

‘మీకు వయసు వచ్చేకొద్దీ పిల్లవాళ్ళై పోతున్నారు’

‘కరెక్ట్‌గా అన్నావు. నా భార్య ముసలిదై పోతుంది నేను పిల్లాడినై పోతున్నాను’

‘అలానే వుంది.’

‘తప్పక వస్తావుకదా ?’

‘ఈ రోజు కాదు.’

‘ఎందుకు ?’

‘నాకు వంట్లో బావుండలేదు.’

‘దేనికి ?’

‘దిగులు. చచ్చిపోతానేమో అనిపిస్తుంది.’

‘అప్పుడే ?’

‘ఎంత త్వరగా చచ్చిపోతే అంత మంచి దని నా ఉద్దేశం నీకు తెలీదేమో నా యిరవై ఐదవ యేట నేను చచ్చిపోతాను.’

‘ఎవరన్నారు ?’

‘జ్యోతిష్యం’

ఫోనులో సిద్ధిక్ నవ్వు వినిపించింది. ‘అందు కని చిక్కిపోతున్నావా ?’ అడిగాడు.

‘ఎవరు ?’

‘నువ్వు. సరే త్వరగా వస్తావుకదూ’

రేణు ఫోను పెట్టేయబోతూ ‘నాకు డబ్బు కావాలి.’ అంది.

‘ఎంత ?’

‘రెండు వందలు’

'అబ్బో !'

'రెండు వందలు మీకో లెక్కకాదు. ఎలాగో మీరు సర్దాలి.'

'ఇప్పుడే ?'

'ఇప్పుడు కాదు. రెండు మూడు రోజుల్లో'

'ప్రయత్నిస్తాను.'

'అలా కాదు. తప్పక మాటయివ్వాలి.'

'సరే-నువ్ వస్తే-'

'యిటో గావడమే తరువాయి.'

'ఎంత సేపట్లో ?'

'ఇప్పుడు టైం ఖచ్చితంగా పదీనలభై అయిందయింది. హోటల్ బైట టాక్సీలున్నాయి, టాక్సీ మీ బంగళాకి ఎంత సేపట్లో చేరుకుంటుంది?'

'పదిహేను నిముషాలు.'

'పదహారో నిమిషాన నేను మీదగ్గరుంటాను చాలా' అని రిసీవర్ హుక్ మీద పెట్టేసి వెనుకకు తిరిగింది రేణు.

నరసు నవ్వుతున్నాడు.

'సిద్ధిక్ దగ్గరకు వెళ్తున్నాను. నువ్ కూడా వస్తావా?' అడిగింది,

నరసు మాట్లాడలేదు. తల అడ్డంగా వూపాడు. సామాన్యంగా నరసు ఎక్కువగా మాట్లాడడు. దేనికైనా సంజ్ఞలతో జవాబు చెపుతుంటాడు.

'ఎందుకు ?' అడిగింది రేణు.

'సిద్ధిక్ అంటే నాకు భయం' అన్నాడు. నరసు కిటికీగుండా బయటకు చూస్తూ.

'దేనికేమిటి ?'

"ఒకసారి మా అన్నయ్య నాకో పెన్ ప్రెజెంట్ చేసాడు. ఇప్పుడు అన్నయ్య లేడు. అ పెన్ ఖరీదు ఎక్కువేమీ కాదు. నా దగ్గర డబ్బుల్లేక ఆ పెన్‌ను సిద్ధిక్‌కు అమ్మాను ఎంతకో తెలుసా - ఒక్క రూపాయకు. నా దగ్గర డబ్బులేనప్పుడు. తిండిలో మల మల మాడిపోతున్నప్పుడు. నా కాళ్ళమీద నేను నిలబడగలిగిన తర్వాత నేను చేద్దామనుకొన్న మొట్టమొదటి మంచిపని ఏమిటంటే అన్నయ్య పెన్ తిరిగి సిద్ధిక్ దగ్గర్నుంచి తీసుకుందామని సిద్ధిక్‌ను అడిగాను. సిద్ధిక్ నవ్వాడు. ఒక్క రూపాయికాదు నాలుగు రూపాయలిస్తానన్నాను. సిద్ధిక్ వప్పుకోలేదు. కాని నాకు ఆ పెన్ అంటే ప్రాణం. ఆ పెన్‌కు నాకూ వున్న అవ్యక్తమైన అనుబంధాన్ని చాలా విప్పిచెప్పాను. "ఈ పెన్ను వల్ల నాకు అదృష్టం కలసివస్తుంది యివ్వను." అన్నాడు. బ్రతిమాలాను. నవ్వాడు. ఆ నవ్వు యిప్పటికీ గుర్తువున్నది" చెప్పేవాడల్లా ఆగిపోయాడు నరసు.

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

కళ్ళు సిగరెట్ నిప్పులా ఎర్రగావున్నాయి.

రేణు టేబుల్ సొరుగులోంచి నల్ల స్వెట్టర్ తీసి తొడుక్కుంది.

'తర్వాత' అంది.

నరసు మాట్లాడలేదు. కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాడు.

"ఆతర్వాత సిద్ధిక్ పెన్ యిచ్చాడా?" అడిగింది రేణు

'ఇవ్వలేదు. ఒకరోజు అతనికి తెలీకుండా పెన్ అతని జేబులోంచి లాగేశాను. సిద్ధిక్ సెన్సిటివ్ మాన్ పట్టుబడ్డాను. అందుకనే అతనంటే భయం.'' అని కిటికీ వైపు తిరిగి బైటకు చూస్తుండిపోయాడు నరసు,

రేణు తన చేతి వాచీ వైపు ఒకసారి చూసుకుని అద్దంలో తనను తను నిశితంగా ఒకసారి పరీక్షించుకుంది.

''నేను వెళ్తున్నాను.'' అంది రేణు.
నరసు మాట్లాడలేదు.

రేణు రెండు క్షణాలుఆగి బైటకు నడిచింది.

టాక్సీలో కూర్చుని అడ్రస్ చెప్పింది. టాక్సీ ఒక్క కుదుపుతో ముందుకు కదిలింది. ఆరుముగం ఒక్క గుటక వేసి కుర్చీలో చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు.

అవ్యక్తమైన అనుభవాలలో చుట్టుకుపోయిన నరుసు తేరుకోడానికి చాలా సేపు పట్టింది. జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించాడు. మనసు నిండా ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఏమీ చేయబుద్ధి కావడంలేదు. ఏదీ చేయకూడదనే కాంక్షా లేదు.

లైటు ఆర్పివేశాడు.

సిగరెట్ చివరిసారిగా పఫ్ చేసి కిటికీలోగుండా బయటకు విసిరివేసాడు.

తెరచిన కిటికీ తలుపులగుండా చల్లటి గాలి వీస్తుంది.

మంచంమీద పడుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. నిద్ర రావటం లేదు. మంచం మీంచి లేచి నుంచున్నాడు.

ఆరుముగం కుర్చీలోంచి బద్ధకంగా లేచి నిద్ర వదలి పోయేట్టు ఒక్కసారిగా వళ్ళు విరుచుకున్నాడు. ఎదురుగా నరసు నుంచున్నాడు. నరసును చూడగనే ప్రాణం లేచి వచ్చినంత పనైంది. "నరసూ! నువ్విక్కడకూర్చో. రెండు నిమిషాలలో అగ్నిహోత్రం చేసి వస్తాను" అన్నాడు తనమామూలు ధోరణిలో నవ్వుతూ.

నరసు తిరిగి నవ్వలేదు.

"ఇప్పుడు కాదు నేను చాల అర్జంటు పని మీద వెళ్తున్నాను, ఒక అరగంటలో వచ్చేస్తాను." అన్నాడు నరసు.

ఆరుముగం నవ్వి "సరే త్వరగావస్తావుకదూ." అన్నాడు.

నరసు రెండడుగులు ముందుకువేసి ఆగి వెనక్కుతిరిగి "నీదగ్గర పెన్ వుందా" అన్నాడు.

ఆరుముగం జేబులోంచి పెన్‌తీసి 'ఎందుకు?' అడిగాడు.

'కావాలి' అని పెన్‌తీసుకుని జేబులో పెట్టుకొని బయటకు నడిచాడు నరసు.

రోడ్ మీద జనసంచారం పలచబడింది. ట్యూబ్ లైట్ల కాంతిలో రోడ్ విచిత్రంగా మెరుస్తుంది. వర్షం నీళ్ళు సన్నగా సంగీతాన్ని ఆలాపిస్తు పరుగెత్తుతున్నాయి. చల్లటి గాలి వీస్తుంది. నరసు మనసులో రకరకాల ఆలోచనలు ముసురుకుంటున్నాయి. రోడ్ మలుపు తిరిగి సిగరెట్ కొట్టుదగ్గర ఆగాడు రేడియోలోంచి సన్నగా వీణ రాగాలాపన వినిపిస్తుంది. నరసును చూడగనే సిగరెట్ కొట్టువాడు నవ్వి 'మైసూర్ పాన్ చేయమంటారా ?' అడిగాడు.

నరసు తలూపాడు.

'ఏమిటలా వున్నారు ?'

(తరువాయి 21 వ పేజి)

## ★ నీటి బుడగలు ★

(14 వ పేజీ తరువాయి)

'ఎవరు నేనా? ఎలావున్నాను?' అడిగాడు నరసు.

'దీర్ఘాలోచనలో పడిపోయారు.

కాదు కాదు అనుకున్నాడు నరసు.

పాన్ తీసుకుని నోట్లో పెట్టుకున్నాడు నరసు.

'సిగరెట్ పెట్టె యివ్వమంటారా?'

'వద్దు' అని ముందుకు కదిలాడు నరసు.

'లెక్కలో రాయమంటారా?'

తలూపాడు నరసు.

"ఎక్కడికి వెళ్తున్నారు?"

నరసు ఆ మాటలు విన్నాడు జవాబు చెప్పలేదు మెల్లగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోసాగాడు.

◆ ◆ ◆

టైం కచ్చితంగా పదకొండయింది. వాచీ వైపు ఒకసారి కోపంగా చూసి సోఫాలోంచి లేచాడు సిద్దిక్. సిగరెట్ వెలిగించాడు. తెరిచి వున్న కిటికీలోగుండా చల్లటి గాలి వీస్తుంది. కిటికీ వైపు నడిచాడు కిటికీలోగుండా క్రిందకు చూశాడు. చీకటి పొరలు మసక మసకగా అల్లుకున్నాయి. రేణు ఇంకా రాలేదు. పది హేను నిముషాలలో వస్తానన్న రేణు ఇరవై నిముషాలు దాటినా రాలేదు. రేణు యౌవ్వనం అందం, స్పర్శ, పెదాలు తనకు ప్రతిసారి క్రొత్తగానే వుంటాయి. రేణు తనకు తీరని కోరికగా వుండిపోతుంది.

మరో ఐదు నిముషాలు గడిచాయి.

సిగరెట్ కిటికీలోగుండా బైటకు విసిరేశాడు.

నిద్ర ముంచుకు వస్తోంది.

రోడ్ మీద కారు శబ్దమైంది. కారు తన ఇంటి ముందు ఆగుతుంది అనుకున్నాడు. కారు ఆగలేదు.

ఎక్కడ్నించో సన్నగా ఈలపాట వినిపిస్తోంది.

తిరిగి వచ్చి మంచం మీద పడుకున్నాడు.

కళ్ళు మూసుకున్నాడు.

నిశ్శబ్దం ప్రకృతిని కలవర పరుస్తున్నట్లు దూరంగా ఎక్కడో కుక్క ఏడుస్తున్న ధ్వని ఆగి ఆగి వినిపిస్తోంది.

కీచు మసలనౌకరు బొంగురు కంఠం 'ఎవరూ?' అంది.

ఏదో సన్నని సమాధానం.

రేణు అనుకున్నాడు సిద్దిక్. లేచి కూర్చుని పడుకున్నాడు. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

మెట్లమీద స్లిప్పర్స్ ధ్వని.

కీచుమంటూ తలుపు తెరచిన చప్పుడు.

గాజులు గలగల మన్నాయి.

తలుపులు దగ్గరగా వేసిన ధ్వని.

చీర రెపరెపలు దగ్గరయాయి.

'నేను' అంది రేణు.

సిద్దిక్ మాట్లాడలేదు.

'నేను వచ్చాను'

సిద్దిక్ కళ్ళు తెరచి 'ఆలస్యంగా వచ్చావు.' అన్నాడు.

రేణు సిద్దిక్ పెదాలమీద ముద్దుపెట్టుకుని 'అవును ఆలస్యమైంది' అంది.

సిద్దిక్ రేణు నడుం చుట్టూ చేతులువేసి ముందుకు లాక్కున్నాడు.

పేరు తెలీని పిట్ట అరుచుకుంటూపోయింది.

అరగంటలో వస్తానన్న నరసు వచ్చేసరికి రెండు గంటలయింది.

కౌంటర్ దగ్గర ఆర్ముగంలేడు.

సరాసరి గదికి వెళ్ళాడు నరసు

ఆర్ముగం ఇంకా నిద్రపోలేదు. కుర్చీలో కూర్చుని కాళ్ళు బల్లమీద పెట్టి సిగరెట్ కాలుస్తున్నాడు. నరసును చూడగనే 'ఇంత త్వరగా వచ్చావేం?' అన్నాడు నవ్వుతూ.

'ఆలస్యమైంది. ఇదో' అంటూ జేబులోంచి ఒక పెన్ తీసి యిచ్చాడు నరసు.

'ఇదెక్కడిది? నా పెన్ ఏది?' అడిగాడు ఆర్ముగం క్రొత్త పెన్ చూసి.

'నీ పెన్ ఎక్కడో పోయింది. మరో పెన్ కొనిస్తాను. అందాక యిది వాడుకో' అన్నాడు నరసు.

ఆర్ముగం మాట్లాడకుండా పెన్ తీసుకొని జేబులో పెట్టుకున్నాడు.

నరసు ఆర్ముగం ముందుకువంగి ఏదో చెప్పేవాడల్లా ఆగిపోయాడు.

'ఏమిటి?' అడిగాడు ఆర్ముగం.

"రేణు చనిపోయింది" నరసు ఆమాటనే మెల్లగా నాలుగుసారులు అన్నాడు.

'ఎలా?'

"ఇక్కడ్నుంచి టాక్సీలో బయలుదేరింది. ఖచ్చితంగా టవరుక్లాక్ దగ్గర మలుపు దగ్గర ఒకలారీకి గుద్దుకుంది. సరిగ్గా పదకొండు గంటలకు రేణు అక్కడికక్కడే చనిపోయింది" అన్నాడు నరసు.

ఆర్ముగం కుర్చీలోంచి లేచి నుంచున్నాడు.

"పద వెళ్దాం" అన్నాడు.

నరసు ఆర్ముగం చేయి పట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టాడు. "వద్దు. ఎక్కడికి వెళ్ళవద్దు. నాకు భయంగా వుంది. నన్ను వదిలిపెట్టి ఎక్కడికి వెళ్ళవద్దు." అన్నాడు.

—

'ఒక ఆఫీసులో పనిచేస్తున్న గుమాస్తా ప్రమాదంపాలయి హాస్పిటల్లో చేరాడు. యజమాని చూడానికివచ్చి, అతన్ని ఓదారుస్తూ ఆఫీసు గురించి బెంగపెట్టుకోకు- నువ్వు చేసేపని ఎవరికయినా అప్పచెప్పి చేయిద్దామనుకున్నా, ఆఫీసులో నువ్వు చేసే పనేమిటో ఎవరికీ తెలియడంలేదు.' అన్నాడు.